క్లుప్తంగా

కనుల పండువగా వీర నారాయణుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల కేంద్రంలోని శ్రీ వీరనారాయణస్వామి ఆలయంలో గోకులాష్టమిని పురస్కరించుకొని ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సాయంత్రం స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దత్తున పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా చూసి పునీతులయ్యారు. శ్రీ వీరనారాయణుడు కృష్ణావతారంలో దర్శమిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్బశాస్త్రి, కిట్టయ్యశర్మ, తిరుమలయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొండాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయం పరిధిలోని గురువారం నుంచి మూడురోజులపాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారని వివరించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా అందుబాటులో ఉండాలని ఈఓఆర్డీ సూచించారు.

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకోనున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పాణ్యం: మండల పరిధిలో తెగుళ్ల వలన పంటలు నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తమ్మరాజుపల్లె గ్రామంలో పత్తిపంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో 280 ఎకరాల్లో పత్తి సాగు చేశారని, వర్షాలు ఆలస్యం కావడంతో కౌలు రైతులకు అదనపు భారం పడిందన్నారు. దీనికి తోడు వివిధ రకాల తెగుళ్ల సోకి నిలువునా నష్టపోయారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ప్రసాద్, బాలచంద్రుడు, వెంకటసుబ్బయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామంలో మంగళవారం మట్టిమిద్దె కూలి ఓ వృద్ధురాలు మరణించిన విషయం తెలిసిందే.. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో వృద్ధురాలు శివనాగమ్మ(70) శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందతూ కొలుకోలేక బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పి. అశోక్ తెలిపారు. మృతురాలి స్వగ్రామం బనగానపల్లె మిట్టపల్లె గ్రామం. ఆమె తన ఏకైక కుమార్తెకు కౌలురులో వివాహం చేసింది. 13 ఏళ్లగా బిడ్డ వద్దనే ఉంటోంది. నాగమ్మ, శివ నాగమ్మలు స్నేహితులు. వీరు ప్రతి రోజు కాలక్షేపం కోసం నాగమ్మ ఇంట్లో కుర్చొని మాట్లాడకునే వారు. ఎప్పటిలాగే ఇంట్లో మాట్లాడుకుంటున్న ఇద్దరు మట్టి మిద్దె కూలి మృతిచెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చించింది.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు : మండల పరిధిలోని ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్‌ఐ నల్లప్ప బుధవారం తెలిపారు. ఉలిందకొండ గ్రామానికి చెందిన పుణ్యవతి అదే గ్రామానికి చెందిన నడిపి సంజీవుడు ఆరు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. మూడు నెలలు కాపురం సజావుగా సాగింది. ఆ తరువాత భర్తతో పాటు అత్త వెంకటేశ్వరమ్మ కటన్నం కోసం సూటిపోటి మాటలతో శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. ఈ మేరకు బుధవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సాంస్కృతికాంశాలపై పోటీలు

కర్నూలు కల్చరల్: వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులకు సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, జూనియర్ కళాశాలల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు బుధవారపేటలోని కేశవ మెమోరియల్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నిమజ్జనం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు కేశవ మెమోరియల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ సత్యనారాయణ 9441360037, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చెన్నయ్య 9440769600, ఉపాధ్యాయులు చింతలపల్లి రామకృష్ణ 9949566999 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఆర్బీకేల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు
- కావాల్సిన ఎరువులు అందుబాటులో



వరి పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు, రైతులకు వరిసాగులో మెలకువలు వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

గడివేముల: రైతులు వరి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం అంతటా నాట్లు వేశారు. పంట పచ్చగా అయ్యే దశలో పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయశాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరైన సలహాలు, సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

జింక్ లోపం, నివారణ..
జింక్ లోపం ఉన్న పంటలో 3 లేదా 4 ఆకులతో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి, ఆకు పెలుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

కాండతొలుచు పురుగు.. నివారణ
నారుమడి నుంచి పూతదశ వరకు వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచాకారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకు ముడత..
గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయడం వలన ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ..
సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి వల్ల ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండు తెగులు– నివారణ...
బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్ట కుళ్లు తెగులు...
వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బెండజిమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి.

నీటియాజమాన్యం..
పిలకలు వేసే దశలో, పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్టదశలో, పూత దశలో పొలంలో 5 సెంటీ మీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం...
భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. నీటి యాజ మాన్య పద్ధతులు, ఎరువుల యాజ మాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెలకువలు అనుసరించటం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. ఆర్బీకేల ద్వారా రైతులను చైతన్య పరుస్తున్నాం. రైతులకు అవసరమైన ఎరువులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

10న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 10 న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా స్థాయి సీనియర్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ ప్రతినిధి దాదా బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9985161007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


మాట్లాడుతున్న చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం దూపాడు సమీపంలోని సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ సుబ్బారెడ్డి, కళాశాల కరెస్పాండెంట్ ఎస్ విజయలక్ష్మమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడితే కానీ విజయం సాధించలేమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కన్నా కుమార్, అధ్యాపకులు తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించాలి


పంచలింగాలలో ఇంటింటి ఓటర్ల సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): ఓటర్ల జాబితాను పక్కాగా, పారదర్శకంగా రూపొందించాలని కర్నూలు ఆర్డీఓ సి.హరిప్రసాద్ బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఇంటింటా ఓటర్ల సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల సర్వే రికార్డులను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మొబైల్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సవరణలతో పాటు ఫోటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటరు ఆమోదంతో చేయాలని సూచించారు. 2024 జనవరి 5వ తేదీన తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుందని వెల్లడించారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, వీఆర్‌ఓ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటరు సర్వే పరిశీలన
గూడూరు : పట్టణంలోని పలు వార్డుల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి చేస్తున్న ఓటరు సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. ఈ నెల 25 నాటికి ఇంటింటికీ తిరిగే కార్యక్రమాన్ని ముగించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి


శ్రీనివాసులు గౌడ్ (ఫైల్)

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈడిగ శ్రీనివాసులు గౌడ్ (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈడిగ గోపాల్ బ్రదర్స్‌కు కుటుంబ సభ్యుడైన ఈడి గ శ్రీనివాసులు గౌడ్ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో కర్నూలులో వైద్యం పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ
ఈడిగ శ్రీనివాసులు గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి బాయికాటి మద్దిలేటి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ వెంకటేశ్వర్లు, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, మాజీ ఎంపీపీ నాగమనెమ్మ, సింగల్ విండో మాజీ చైర్మన్ సీబీ గోవింద రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.


శ్రీనివాసులు గౌడ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ఆటో డ్రైవర్ నిజాయతీ

కర్నూలు: ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయతీని చాటుకున్నాడు. పేరు చెప్పుకోవడానికి ఇష్టం లేని ఓ మహిళ షరాఫ్ బజార్‌లో రెండు తులాల గొలుసుతోపాటు కొన్ని విలువైన వస్తువులను కొనుగోలు చేసి కొత్త బస్టాండ్‌కు వెళ్లేందుకు గిరి ఆటోను ఎక్కింది. అక్కడకు చేరుకున్నాక ఆమె హడావుడిలో బ్యాగును మరచిపోయి దిగింది. కాసేపటి తర్వాత ఆటో డ్రైవర్ బ్యాగును గుర్తించి వన్ టౌన్ పోలీసులకు అందజేశాడు. అందులోని ఆభరణాలు, వస్తువుల ఆధారంగా సీఐ నాగశేఖర్,హెడ్ కానిస్టేబుల్ ఎస్‌ఎంబాషా, కానిస్టే బుళ్లు మద్దిలేటి, మురళీ బాధిత మహిళను స్టేషన్‌కు రప్పించి బ్యాగును అప్పగించారు. ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును నిజాయతీగా తెచ్చి ఇచ్చిన గిరిని పోలీసులు,ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు ప్రభాకర్, బి. రాధాకృష్ణ, ఎస్‌ఎండీ షరీఫ్ అభినందించారు.

9న ఐసీఈయూ శిక్షణ తరగతులు

కర్నూలు(అర్బన్): ఈనెల 9న ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఆర్ సునీయకుమార్, డివిజన్ సంయుక్త కార్యదర్శి టీ రమేష్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ తరగతులకు ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పి.సతీష్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏ.రఘునాథరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులకు జిల్లాలోని ఇన్సూరెన్స్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతులను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ–1, 2 బుధవారం తెలిపారు. 33 కేవీ ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, శ్రీరామ్‌నగర్, మద్దూరునగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జొహరాపురం, చెక్‌పోస్ట్, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, ధనలక్ష్మి నగర్, మారుతి మెగా సిటీ, న్యూ కమలా నగర్, లక్ష్మి టౌన్‌షిప్, శ్రీవారి కుటీర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.




గొల్లలదొడ్డిలో ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు,కోడుమూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు,గోపూజను నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పాణ్యంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన


హుసేనాపురంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


పాణ్యం శ్రీ కృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కోడుమూరులోని యాదవవీధిలో వెలసిన శ్రీకృష్ణ దేవాలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అంతకుముందు గోపూజ, గణపతి, నవగ్రహ పూజలను యాదవ సంఘం సభ్యులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడు ఉట్టి కొట్టే పోటీలు
కృష్ణాష్టమిని పురస్కరించుకొని గురువారం స్థానిక శ్రీకృష్ణుడి ఆలయ ఆవరణంలో ఉట్టి కొట్టే పోటీలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించేందుకు యాదవ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గొల్లలదొడ్డి గ్రామంలోని కొలువైన శ్రీకృష్ణుడి ఆలయంలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో గోపూజ చేశారు. అదే విధంగా గ్రామంలో స్వామివారికి పల్లకీ సేవను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పాణ్యం: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వీరనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ ఆలయంలో వెలసిన కృష్ణుడికి తెల్లవారుజామున నుంచి విశేష పూజలు జరిపారు. స్వామి వారికి కల్యాణం చేపట్టారు. పలు పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కందికాయపల్లె కొండల్లో వెలసిన శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామి వారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఓర్వకల్లు : మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం సమీపంలోని కృష్ణదేవాలయం వద్ద బోయ సుబ్బడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి భజన మండలి వారిచే భజన గీతాలు ఆలపించారు. హుసేనాపురం గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి సర్పంచు చంద్రగోవర్ధనమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి కల్లూరు అధ్యక్షులు పురుషోత్తం, సభ్యులు ఈశ్వరయ్య, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు అర్బన్‌లోని ఎల్ వెంకయ్య నగర్‌లో ప్రబోధ సేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం పూజ, సత్సంగం మధ్యాహ్నం పల్లకీ ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శ్వేతారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, పుల్లారెడ్డి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో రంగం రాష్ట్ర ప్రథమ మహాసభలు


మహా సభల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎ.కరుణాకర్ బాబు తెలిపారు. బుధవారం కళాక్షేత్రంలో మహా సభల పోస్టర్లు, టీషర్ట్‌లను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు కార్యక్రమ సమన్వయకర్త డి.జగన్నాథం, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు రంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్ బాబు మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదికను బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల ప్రతినిధులతో ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వేదిక సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు డాక్టర్ అమరేంద్రరెడ్డి, మోజెస్ పాల్గొన్నారు.

రజక ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం పొందిన రజక సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు

కర్నూలు(అర్బన్): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రజక విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల రజక సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్థానిక సేవా సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రజక విద్యా సేవా సమితి అధ్యక్షులు సీపీ వెంకటేష్, గౌరవ సలహాదారు ఎం నాగన్న తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దూరు వెంకట్, రాష్ట్ర నాయకులు లింగమయ్య, జగదీష్, రజక సంఘం ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడాల నాగరాజు, జిల్లా అధ్యక్షులు గోల్డ్‌మెన్ శ్రీను, నాగటూరు వెంకటేష్, ఎల్‌ఐసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామానికి చెందిన ఏదు లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు గడిగరేవుల గ్రామానికి చెందిన ఏదు లక్ష్మీదేవి రొడ్డుపైన ఉండగా పాతకక్షలు మనసులో ఉంచుకుని అదే గ్రామానికి చెందిన గోనేల హరి, గోనేల హర్షిత, హరికిషోర్, మద్దయ్య, వెంకటేశ్వర్లు, జానకమ్మ, రామసుబ్బడు, పెద్ద లక్ష్మమ్మ, చిన్న లక్ష్మమ్మ దాడి చేసిన గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేస్తాం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. బుధవారం నంద్యాలలో రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్సీ ఇసాక్ బాషాను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. అర్హత గల ఔత్సాహిక ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా అధికారులను వెంటనే సంప్రదించాలన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు జమాన్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిబాషా, నాయకులు మహబూబ్‌బాషా, ఫయాజ్ హాలీ, కలీముల్లా, అనీఫ్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు చోటు చేసుకోరాదు

నంద్యాలటౌన్: మాతా శిశు మరణాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణుల ప్రసవ ప్రణాళికను రూపొందించి వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలని చెప్పారు. అలాగే శిశులకు వ్యాక్సిన్‌లు సకాలంలో వేసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆశా, ఏఎన్‌ఎంలకు కేటాయించిన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, 5 ఏండ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, కుటుంబ వైద్య విధాన నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్ చంద్ర, డాక్టర్లు శ్రీమంత్, కాంతారావు, ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బస్తిపాడులో కళకళలాడుతున్న మొక్కజొన్న పంట


కొర్ర పంట


ఉల్లి పంట

కళకళలాడుతున్న ఖరీఫ్ పంటలు

కల్లూరు: నెల రోజులుగా మోహం చాటేసిన వరుణుడు కరుణించడంతో గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు పంటలు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. మండలంలో కొర్ర, మొక్కజొన్న, ఆముదం, ఉల్లి, కంది, వేరుశనగ పంటలను ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుముఖం పట్టగా.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు ఊపిరి వచ్చి పచ్చదనం సంతరించుకున్నాయి. రైతులు ఎరువులు, మందులు చలుతు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.